

ప్రశాంతంగా పాలిటెక్నిక్ కౌన్సెలింగ్

పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. 8లో



కరాటేలో 'జై'వర్ధిని

కరాటేలో మధురవాడకు చెందిన హనీష జైవర్ధిని రికార్డులు కొల్లగొడుతోంది. ఆరేళ్ల వయసులోనే సత్తాచాటుకుంటోంది. 8లో



నేటి నుంచి చందనం అరగదీత

సింహగిరిపై మంగళవారం నుంచి మూడో విడత 120 కిలోల చందనం అరగదీత ప్రారంభంకానుంది. 8లో

నిరసనల వెల్లువ

- పేదల పండగంటే చంద్రబాబుకు ఎందుకంత హేళన
- ఇళ్ల పట్టాల పంపిణీని చూసి ఓర్వలేకపోతున్నారు
- టీడీపీ అధ్యక్షుడి వ్యాఖ్యలపై ప్రజాగ్రహం
- నిరసనగా బైక్ ర్యాలీలు, మానవహారాలు



జాతీయ రహదారిలో ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

సాక్షి, విశాఖపట్నం : పండగలా జరిగిన పట్టాల పంపిణీపై ఎందుకంత అక్కసు.. పేదలకు మేలు జరుగుతుంటే ఓర్వలేకపోతున్నారెందుకు.. చంద్రబాబుకు మొదటి నుంచీ సామాన్యులపై చులకన భావమే.. టీడీపీ ప్రభుత్వ హయాంలో మేలు చేయలేదు సరికదా ఇన్నాళ్లకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో న్యాయం జరుగుతుంటే హేళనగా మాట్లాడతారా.. అంటూ ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. జిల్లా అంతటా చంద్రబాబు వ్యాఖ్యలపై వ్యతిరేకత వ్యక్తమైంది. పలుచోట్ల బైక్ ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. పేదవారంటే చంద్రబాబుకు మొదటి నుంచీ చులకన భావమేనని.. అధికారంలో ఉన్నప్పుడు పేదలపై, దళితులపై దాడులు చేయించాడని, అధికారం పోయినా బుద్ధి రాలేదని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉచితంగా ఇళ్ల పట్టాలు అందిస్తుంటే చూసి తట్టుకోలేకపోతున్నారని ధ్వజమెత్తారు. హేళనగా మాట్లాడితే సహించబోమని స్పష్టం చేశారు.

- ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె రాజు ఆధ్వర్యంలో విశాఖ ఉత్తర వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి ఆర్‌అండ్‌బీ జంక్షన్ వరకు భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలియజేశారు. జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శిస్తే పేదలను అవమానించడంగానే ప్రజలు భావిస్తారని, నోరు అదుపులో పెట్టుకోవాలని కేకేరాజు హెచ్చరించారు.
- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో జగదాంబ జంక్షన్ నుంచి పాత పోస్టాఫీస్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, మత్స్యకార డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ, పార్టీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు. చంద్రబాబు మానసిక పరిస్థితి బాగోలేదని.. అందుకే ఇలాంటి మాటలు మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే వాసుపల్లి ధ్వజమెత్తారు.
- వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఎంవీపీ కాలనీ టీటీడీ సర్కిల్ నుంచి బీచ్‌రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అక్కడ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నేతలు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.





జగదాంబ జంక్షన్‌లో ర్యాలీ చేపడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, పార్టీశ్రేణులు, బీచ్‌రోడ్డులో అక్కరమాని వెంకటరావు ఆధ్వర్యంలో ర్యాలీ

న్యూస్‌రీల్

ఎంఎస్‌ఎంఈ సెట్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న కృష్ణమోహన్

ఎంవీపీకాలనీ: ఎంఎస్‌ఎంఈ సెట్–2023 ఫలితాలను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ విడుదల చేశారు. మినిస్ట్రీ ఆఫ్ ఎంఎస్‌ఎంఈ సెంటర్స్ ద్వారా నిర్వహిస్తున్న ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీస్ సంస్థ విద్యార్థులకు అందిస్తున్న పలు కోర్సుల్లో ప్రవేశాలకు గాను ఇటీవల ఏయూ పర్యవేక్షణలో ఈ ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో రిజిస్ట్రార్ కృష్ణమోహన్ సోమవారం ఆ పరీక్షల ఫలితాల సీడీని విడుదల చేశారు. కార్యక్రమంలో ఆచార్య సత్యనారాయణ, ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీస్ సెంటర్ కన్సల్టెంట్ ఎం.కాలేబు, మేనేజర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



సమీక్షిస్తున్న జేసీ విశ్వనాథన్

విశాఖ విద్య: జిల్లాలో జూన్ 2 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జేసీ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 5,981 మంది విద్యార్థులు పరీక్షలు హాజరుకానున్నారని, ఇందుకు 24 కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, డిజిటల్ పరికరాలు వంటివి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి లేదని, ఈ విషయాన్ని విద్యార్థులకు ముందుగానే తెలియజేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా మంచినీరు సదుపాయం కల్పించాలని జీవీఎంసీ అధికారులకు ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఆరోగ్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని వైద్య శాఖ అధికారులను, విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని ఈపీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఇన్‌చార్జి డీఈవో జి.లక్ష్మణరావు, ప్రభుత్వ పరీక్షల విభాగం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ మురళీమోహన్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ఐఏఎస్ అధికారులు



ఆశీర్వచనం స్వీకరిస్తున్న అధికారులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జీఎస్టీ జాయింట్ కమిషనర్ ఆనంద్, ఐఏఎస్ అధికారి కార్తికేయ మిశ్రా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వీరి పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని ఏఈవో శ్రీనివాసరావు అందజేశారు.

పలు ప్రత్యేక రైళ్లు



తాటిచెట్లపాలెం: వేసవి సెలవుల నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం హైదరాబాద్–కటక్ (వయా దువ్వాడ మీదుగా) మధ్య స్పెషల్ రైళ్లు నడుపుతున్నన్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. హైదరాబాద్–కటక్(07165) స్పెషల్ హైదరాబాద్‌లో (ప్రతీ మంగళవారం) రాత్రి 8.10 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 9.07 గంటలకు బయల్దేరి అదేరోజు సాయంత్రం 5.45 గంటలకు కటక్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు జూన్ 6, 13, 20, 27 తేదీల్లో నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కటక్–సికింద్రాబాద్(07166) స్పెషల్ కటక్‌లో (ప్రతీ బుధవారం) రాత్రి 10.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.35 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 7.37 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 9 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు జూన్ 7, 14, 21, 28 తేదీల్లో నడుస్తుంది.

ఆటోనగర్ ఆర్వోబీకి గ్రీన్‌సిగ్నల్!

- అప్రోచ్ రోడ్లకు ఆర్థిక శాఖ నుంచి లైన్‌క్లియర్
- రూ.27 కోట్ల నిర్మాణ వ్యయం
- పలు ప్రాంత ప్రజలకు ఊరట
- టెండర్లు పిలవడానికి ఆర్‌అండ్‌బీ సన్నాహాలు



అప్రోచ్ రోడ్లు నిర్మించాల్సిన ఆర్వోబీ ఇదే

సాక్షి, విశాఖపట్నం: చిరకాల సమస్యకు పరిష్కారానికి మార్గం సుగమమైంది. రైల్వే గేటు కష్టాలకు శాశ్వతంగా తెరపడనుంది. గాజువాక జలా పరిధిలోని ఏపీఐఐసీ మార్షల్ యార్డు వద్ద ఉన్న లెవెల్ క్రాసింగ్‌తో ఏళ్ల తరబడి వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. రైళ్ల రాకపోకల వల్ల ప్రతి 20–30 నిమిషాలకు ఈ గేటు మూతపడుతోంది. దీంతో గేటుకు రెండు వైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ లెవెల్ క్రాసింగ్ వద్ద రైల్ ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణం చేపట్టాలని ఆ ప్రాంత ప్రజలతో పాటు నిత్యం వాటి మీదుగా ప్రయాణించే వాహనదారులు ఎన్నాళ్ల నుంచో కోరుతున్నారు. దీంతో ఆర్వోబీ నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకొచ్చాయి. ఇందుకు రూ.27 కోట్లు అవసరమని అంచనా వేశారు. ఇందులో రైల్వే శాఖ రూ.10 కోట్లు మంజూరు చేసింది. ఈ సొమ్ముతో ఆర్వోబీ నిర్మాణం పూర్తయింది. అయితే ఆర్వోబీ అందుబాటులో రావాలంటే వీటికి అనుబంధంగా అప్రోచ్ రోడ్లు, ఇతరత్రా పనులకు మరో రూ.17 కోట్లు కావలసి ఉంది.

రాష్ట్ర ప్రభుత్వం ఈ నిధులు మంజూరు చేసే సమయంలో ప్రధానమంత్రి సేతు బంధన్ పథకంలో అప్రోచ్ రోడ్లకు అవసరమైన నిధులు సమకూర్చేందుకు కేంద్రం ముందుకొచ్చింది. దీంతో రహదార్లు, భవనాల శాఖ నుంచి రాష్ట్ర ఆర్థిక శాఖకు ఈ దస్త్రాన్ని పంపారు. ఈ పనులు చేపట్టడానికి రాష్ట్ర ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. తాజాగా ఆర్థిక శాఖ దీనికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో పరిపాలనా ఆమోదం లభించినట్టయింది. త్వరలోనే దీనికి సాంకేతిక అనుమతులు రావల్సి ఉంది. ఆర్థిక శాఖ నుంచి అనుమతి వచ్చాక ఇది కూడా లాంఛనప్రాయమే అవుతుంది. ఈ నేపథ్యంలో ఈనెల 26న జరిగిన ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ ఎ.మల్లికార్జున ఆర్వోబీ అప్రోచ్ రోడ్ల పనులకు సత్వరమే టెండర్లు పిలవాలని రహదార్లు, భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. నెల రోజుల్లో టెండర్ల ప్రక్రియ ప్రారంభించనున్నారు. ఈ అప్రోచ్ రోడ్ల పనులకు టెండర్లు పిలిచాక ఏడాదిన్నర లోగా పూర్తి చేస్తామని ఆర్‌అండ్‌బీ సూపరింటెండింగ్ ఇంజినీర్ జాన్ సుధాకర్ 'సాక్షి'కి చెప్పారు.

ఆర్వోబీ అందుబాటులోకి వస్తే..

ఈ ఆర్వోబీ అందుబాటులోకి వస్తే ఎన్నో ఏళ్లుగా వాహనచోదకులు పడుతున్న అవస్థలకు విముక్తి లభించినట్టవుతుంది. ఆటోనగర్‌లోని ఎఫ్, ఈ బ్లాకులు, అపారెల్ పార్కు బ్లాకు, గ్రీన్ సిటీ వైపు పలు పరిశ్రమలున్నాయి. బీహెచ్‌పీవీ వైపు నుంచి ఆటోనగర్ వచ్చే భారీ వాహనాలు, ఏ,బీ,సీ,డీ బ్లాకులకు వెళ్లే వాహనాలకు, అగనంపూడి, వడ్లపూడి, ఫకీర్‌తక్యా, కూర్మన్నపాలెం ప్రాంతాల నుంచి శీలానగర్ ఆర్చి వైపు వెళ్లే వాహనాలతో పాటు ఆ ప్రాంత పరిధిలో ఉన్న నాలుగు వార్డుల ప్రజలకు ఎంతో ఉపశమనం లభిస్తుందని ఆటోనగర్ జలా కమిషనర్ సూర్యనారాయణ 'సాక్షి'కి చెప్పారు. ఆర్వోబీకి అప్రోచ్ రోడ్ల నిర్మాణం పూర్తయితే ఇకపై రైల్వే గేటు మూత సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందని తెలిపారు.

ఏరోస్పేస్ రంగంలో విస్తృత అవకాశాలు

మురళీనగర్: ఏరో స్పేస్ రంగంలో డిప్లమా విద్యార్థులకు విస్తృతమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయని రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎంఏవీ రామకృష్ణ అన్నారు. ఏరోస్పేస్ రంగంలో పారిశ్రామిక శిక్షణకు విద్యార్థుల ఎంపిక ప్రక్రియను ఆయన ఆధ్వర్యంలో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఏరో స్పేస్‌కు సంబంధించిన ఉత్పాదక రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందని, వీరికి నైపుణ్యం కలిగిన విద్యార్థుల అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులను ఆ రంగంలో నైపుణ్యం సాధించే విధంగా ప్రోత్సహించి, ఉన్నత ఉద్యోగావకాశాలు కల్పనకు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ మేరకు గ్లోబల్ ఏరోస్పేష్ కంపెనీ బోయింగ్, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్‌ల సహకారంతో డిప్లమా మెకానికల్ విద్యార్థులకు ఆరు నెలల పారిశ్రామిక శిక్షణకు ఎంపిక నిర్వహించినట్లు చెప్పారు.

20 మందికి అవకాశం

ఈ ఎంపిక ప్రక్రియలో 72 మంది విద్యార్థులు పాల్గొనగా 20 మంది శిక్షణకు ఎంపికయ్యారు. వీరికి అచ్యుతాపురంలోని ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ కేంద్రంలో శిక్షణనిస్తారు. శిక్షణ కాలంలో బోయింగ్ కంపెనీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ సంస్థలకు నిధులు అందిస్తుంది. లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ సంస్థ ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సెంటర్‌లో శిక్షణ తీసుకునే విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.35,000లు కోర్సు ఫీజుతోపాటు నెలకు రూ.3వేలు ఉపకార వేతనం చెల్లిస్తుంది. డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎంఏవీ రామకృష్ణ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ కాలేజీ ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు, ఎల్ఎల్ఎఫ్ ప్రిన్సిపల్ కన్సల్టెంటు సి.ప్రదీప్‌కుమార్, ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సెంటర్ ట్రైనింగ్ మేనేజర్ జి.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నగర పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికులే కీలకం



పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

ఉత్తమ కార్మికులను సత్కరించిన మేయర్, కమిషనర్

డాబాగార్డెన్స్: నగర పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికులే కీలకమని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గల మేయర్ ఛాంబర్లో పారిశుధ్య నిర్వహణలో ఉత్తమ పనితనం కనబరిచిన కార్మికులను మేయర్, కమిషనర్ సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెలా చివరి సోమవారం ప్రజారోగ్య విభాగంలో ఉత్తమ సేవలందించిన సిబ్బందిని అభినందించడం జరుగుతుందన్నారు. జోన్–1 నుంచి జె.సురేష్, జోన్–2 నుంచి పి.దేవుడమ్మ, జోన్–3 నుంచి కె.నాగలక్ష్మి, జోన్–4 నుంచి ఎస్.సూరిబాబు, జోన్–5 నుంచి సీహెచ్.అప్పయ్యమ్మ, జోన్–6 నుంచి ఎస్.పెద్దినాయుడు, జోన్–7 నుంచి కె అప్పలనరసమ్మ, జోన్–8 నుంచి పి తాతారావుతో పాటు 13వ వార్డుకు చెందిన వార్డు సచివాలయ శానిటరీ కార్యదర్శి పి.నాగేశ్వరరావు, 89వ వార్డుకి చెందిన ఎల్ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి శ్రీకాంత్‌ను సత్కరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వి సన్యాసిరావు, సీఎంఓహెచ్ డాక్టర్ నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

'ప్రైవేట్'లో ఉచిత సీట్లకు తూట్లు

కొమ్మాది సేవానగర్‌కు చెందిన రితిక్ రోషన్‌కు సమీపంలోని ప్రైవేటు పాఠశాలలో ఒకటో తరగతిలో ఉచిత విద్య సీటు లభించింది. కానీ జాబితాలో పేరులేదని సదరు స్కూల్ యాజమాన్యం చేర్చుకునేందుకు నిరాకరించింది. దీనిపై రితిక్ రోషన్ తల్లిదండ్రులు సోమవారం డీఈవో కార్యాలయానికి వచ్చి, తమ సమస్యను చెప్పుకున్నారు. జాబితాలో పేరు ఉందని, స్కూల్‌కు వెళ్లి జాయిన్ కావాలని ఇక్కడి సిబ్బంది సూచించారు. ఇలాగే కొన్ని ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల నిర్వాకంతో చాలామంది విద్యార్థుల తల్లిదండ్రులు డీఈవో కార్యాలయానికి క్యూ కడుతున్నారు.

- సీట్లు పొందిన విద్యార్థులను చేర్చుకునేందుకు నిరాకరిస్తున్న యాజమాన్యాలు
- డీఈవో కార్యాలయానికి క్యూ కడుతున్న తల్లిదండ్రులు
- పాఠశాలల్లో చేరేందుకు నేటితో ముగియనున్న గడువు



పిల్లలను వెంటబెట్టుకొని డీఈవో కార్యాలయానికి వచ్చిన తల్లిదండ్రులు

విశాఖ విద్య: పేద విద్యార్థులకు ప్రైవేటు/కార్పొరేట్ స్కూళ్లలోనూ ఉచిత విద్యనందించాలనే ప్రభుత్వ ఆశయానికి తూట్లుపడుతున్నాయి. జిల్లాలోని కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఉచిత విద్య సీటు పొందిన వారికి అడ్మిషన్లు ఇవ్వకుండా తిప్పించుకుంటున్నాయి. విద్యాహక్కు చట్టం అమల్లో భాగంగా ప్రైవేటు స్కూళ్లలోనూ పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించేలా ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు కేటాయించాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ విశాఖలోని కొన్ని ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు నిర్వాకంతో ప్రభుత్వం కల్పించిన చక్కటి అవకాశాన్ని వినియోగించుకోలేక పోతున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు యాజమాన్యాలకు జిల్లా విద్యాశాఖలోని కొంతమంది అధికారులు కొమ్ముకాస్తుండటంతోనే ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నాయనే విమర్శలున్నాయి.

జిల్లా విద్యాశాఖాధికారుల లెక్క ప్రకారం జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు ఉన్న ప్రైవేటు పాఠశాలలు 764 ఉండగా, వీటిలో 585 స్కూళ్లను ఉచిత విద్య అందించేందుకు నమోదు చేయించారు. ఒకటో తరగతి ఫ్రీ ఎడ్యుకేషన్‌లో భాగంగా తొలి విడతలో జిల్లా వ్యాప్తంగా 1,490 మంది దరఖాస్తు చేసుకోగా, వీరిలో 1,079 మంది పాఠశాలలను ఎంపిక చేసుకున్నారు. మొత్తం 915 మందికి సీట్లు కేటాయించగా, వీరిలో 668 మంది అడ్మిషన్లు పొందారు. రెండో విడతలో 977 మందికి సీట్లు కేటాయించగా, సోమవారం నాటికి 287 మంది పాఠశాలల్లో అడ్మిషన్లు పొందారు. మిగిలిన వారు మంగళవారం సాయంత్రంలోగా స్కూళ్లలో చేరాల్సి ఉంది. సీటు పొందిన వారంతా స్కూళ్లలో ఎందుకు చేరలేదనేది తేలాల్సి ఉంది.

కుంటిసాకులతో అవాంతరాలు

ఉచిత సీటు లభించినా, కొన్ని ప్రైవేటు యాజమాన్యాలు కుంటిసాకులతో అవాంతరాలు సృష్టిస్తూ, విద్యార్థులకు అడ్మిషన్ ఇవ్వకుండా తిప్పించుకుంటున్నాయి. ఎంఈవోల పర్యవేక్షణలో గ్రామ/వార్డు వలంటీర్లు, సచివాలయ విద్యా కార్యదర్శి ఇలాంటి వాటిని సీరియస్‌గా తీసుకొని, సమస్యను పరిష్కరించాలి. కానీ నేరుగా జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయం వరకు పిల్లలను వెంటబెట్టుకొని, తల్లిదండ్రులు వస్తున్నారు. లోపం ఎక్కడ ఉందనేది జిల్లా విద్యాశాఖాధికారులు సైతం తగిన పరిశీలన చేయడం లేదు. సీటు వచ్చినా చాలామంది ఉచిత విద్యను అందుకోలేకపోతున్నారు. జిల్లా విద్యాశాఖాధికారులు ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

జిల్లాలో గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలు	764
ఉచిత విద్య అందించేందుకు నమోదైన పాఠశాలలు	585
తొలి విడతలో కేటాయించిన సీట్లు	915
ప్రవేశాలు పొందినవారు	668
రెండో విడతలో కేటాయించిన సీట్లు	977
ప్రవేశాలు పొందినవారు (సోమవారం నాటికి)	287

సీటు ఇవ్వకుంటే చర్యలు తప్పవు



విద్యాహక్కు చట్టం ప్రకారం ఉచిత సీటు పొందిన విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వాల్సిందే. దీనిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయమని దిగువస్థాయి అధికారులకు ఆదేశాలిచ్చాం. ఉచిత అడ్మిషన్లు ఇవ్వలేదని మా దృష్టికొస్తే, అలాంటి స్కూళ్ల గుర్తింపు రద్దు చేస్తాం.

– జి.లక్ష్మణరావు, ఇంచార్జి డీఈవో, విశాఖ జిల్లా

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున. చిత్రంలో జేసీ విశ్వనాథన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి

మహారాణిపేట: 'జగనన్నకు చెబుదాం' అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహించొద్దని కలెక్టర్ మల్లికార్జున పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం, స్పందన వెబ్‌సైట్‌లో నమోదైన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వచ్చిన ప్రతి అర్జీని 24 గంటల్లోగా పరిశీలించి సంబంధిత అధికారులకు పంపాలన్నారు. జగనన్నకు చెబుదాం అర్జీలు రీ ఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అర్జీదారునికి ఇచ్చే సమాధానం పూర్తి వివరాలతో ఉండాలన్నారు. పెండింగ్ దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు తమకు అందిన దరఖాస్తులను పూర్తిగా చదివి, ఒకవేళ అది తమ శాఖకు సంబంధించింది కానట్లయితే సంబంధిత అధికారులకు పంపాలని, ఇటువంటి దరఖాస్తులను మానిటర్ చేయాలని డీఆర్వోకి సూచించారు. జీవీఎంసీకి అర్జీలు అధికంగా వస్తున్నాయని, అర్జీలపై అధికారులు శ్రద్ధ చూపాలన్నారు. గడువు తీరినప్పటికి వివిధ శాఖల్లో అర్జీలు పెండింగ్‌లో ఉండడంపై ఆరా తీశారు. సోమవారం నాటి జగనన్నకు చెబుదాం (స్పందన)కు 163 అర్జీలు అందాయి. రెవెన్యూశాఖకు 47, జీవీఎంసీకి 35, పోలీసు శాఖకు 24, ఇతర విభాగాల నుంచి 57 వినతులు స్వీకరించారు. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వినతులకు తక్షణమే పరిష్కారం



సమస్యలు తెలుసుకుంటున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి(విశాఖ దక్షిణ): స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్‌వర్మ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 43 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ స్వయంగా ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డీసీపీ(క్రైం) జి.నాగన్న, ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, ఏడీసీపీ(ఎస్‌బీ) డి.గంగాధరం, లీగల్ అడ్వైజర్ పి.వి.రామకృష్ణతో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీపీలు, అన్ని పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

జీవీఎంసీ స్పందనకు 84 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్ వర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించగా, వాటిలో జోన్–1 నుంచి ఒకటి, జోన్–2 నుంచి 14, జోన్–3 నుంచి 8, జోన్–4 నుంచి 10, జోన్–5 నుంచి 12, జోన్–6 నుంచి 7, జోన్–7 నుంచి ఒకటి, జోన్–8 నుంచి 14, జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి 17 ఫిర్యాదులు వచ్చాయన్నారు. వీటిలో పరిపాలన, అకౌంట్స్ విభాగానికి 3, రెవెన్యూకు 12, ప్రజారోగ్యానికి 12, టౌన్‌ప్లానింగ్‌కు 31, ఇంజినీరింగ్ విభాగానికి 11, హార్టీకల్చర్‌కు ఒకటి, యూసీడీకి 14 ఫిర్యాదులు అందగా, వీటిని పరిశీలించి మూడు రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డాక్టర్ వై శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు, పట్టణ ప్రణాళికా అధికారి సురేష్‌కుమార్, సీఎంఓహెచ్ డాక్టర్ నరేష్ కుమార్, కార్యదర్శి పి నల్లనయ్య, డీసీ(రెవెన్యూ) ఫణిరామ్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, ఎఫ్ఏ అండ్ ఏఓ మల్లికాంబ, డీపీఓ చంద్రిక, పర్యవేక్షక ఇంజినీర్లు కేవీఎన్ రవి, వినయ్‌కుమార్, వేణుగోపాలరావు, కృష్ణారావు, గోవిందరావు, రామ్మోహనరావు, డీపీవో చక్రధర్, డీఈవో శ్రీనివాసరావు, రీజనల్ ఫైర్ ఆఫీసర్ సీహెచ్ కృపావాసం, డీసీపీలు, ఏసీపీలు, యూసీడీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిటెక్నిక్ కౌన్సెలింగ్

మురళీనగర్: పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి కౌన్సెలింగ్ సోమవారం ప్రారంభమైంది. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో 1–6000 ర్యాంకుల వరకు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 201 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వెయ్యిలోపు ర్యాంకర్లు 10 మంది పాల్గొనడం విశేషం. ఈ కాలేజీలో 196వ ర్యాంకరు కొత్తవలస లక్ష్మీమాధుర్య, 360వ ర్యాంకరు ఎ.రోహిత్, 367వ ర్యాంకరు జి.నిఖిల్, 559 ర్యాంకరు ఆర్‌ఎల్ గణేష్, 565 ర్యాంకరు వి.మణికంఠ, 569 ర్యాంకరు మహ్మద్ దిల్‌షాద్, 624ర్యాంకరు పి.భార్గవి, 819 ర్యాంకరు డి.రాధాకృష్ణ, 822 ర్యాంకరు బి.రేణుక, 989 ర్యాంకు ఎస్.గణవర్ధన్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకున్నారు. వెరిఫికేషన్ సర్టిఫికెట్లను గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అందజేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో 6001నుంచి 12000 ర్యాంకుల వరకు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 263 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. మంగళవారం కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో 12001 నుంచి 195000, పాలిటెక్నిక్ కాలేజీలో 19501 నుంచి 27000 ర్యాంకుల వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేస్తారు.



లక్ష్మీమాధుర్య (196), ఎ.రోహిత్(360), జి.నిఖిల్(367)లకు వెరిఫికేషన్ సర్టిఫికెట్లు అందిస్తున్న పాలిటెక్నిక్ ప్రవేశాల రాష్ట్ర కమిటీ సభ్యుడు డాక్టర్ వెంకటరమణ

సివిల్స్ లక్ష్యం



నాన్న శ్రీనివాసరావు పట్నాయక్, అమ్మ లావణ్య, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో పదో తరగతిలో 588 మార్కులు తెచ్చుకున్నాను. రామకృష్ణ మాస్టార్ గైడెన్స్‌తో పాలిసెట్‌లో 196 ర్యాంకు సాధించాను. డిప్లమా సీఎస్‌ఈ పూర్తయిన తర్వాత బీటెక్ చదివితే మంచి నాలెడ్జ్ ఉంటుందని భావిస్తున్నాను. ఉద్యోగం చేస్తూ సివిల్స్‌కు ప్రిపేరవుతాను.

–కె.లక్ష్మీమాధుర్య(196ర్యాంకు), లంకెలపాలెం

ఎలక్ట్రికల్ చదువుతా..



నాన్న పైడిబాబు ఆర్టీసీ కండక్టర్, అమ్మ నూకరత్నం గృహిణి. మేము కూర్మన్నపాలెంలో ఉంటున్నాం. మా నాన్నగారు కష్టపడి చదివిస్తున్నారు. వారి నమ్మకాన్ని వమ్ముచేయను. ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత స్థితికి చేరుకుంటాం. డిప్లమా ఈఈఈలో జాయిన్ అవుతా. తర్వాత గ్రాడ్యుయేషన్ చేసి సివిల్స్ రాస్తా.

–అనిబోయిన రోహిత్ (360వర్యాంకు)

ఉద్యోగ సాధనే లక్ష్యం



మంచి ఉద్యోగం సాధించి కుటుంబాన్ని బాగా చూసుకోవాలి. నాన్న రామచంద్రరావు కూలి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ కేవీ పాఠశాలలో పదో తరగతి చదివాను. పాలిసెట్‌లో 367 ర్యాంకు సాధించాను. డిప్లమా ఈసీఈ లేదా ఈఈఈ చదవాలని అనుకుంటున్నా. క్యాంపస్‌లో జాబ్ కొట్టాలనేది ఆశయం.

– జి.నిఖిల్(367ర్యాంకు), అగనంపూడి

కరాటేలో 'జై'వర్ధిని

- నిమిషంలో 370 కంప్లీట్ పంచ్ స్ట్రైక్స్
- కరాటేలో రాణిస్తున్న మధురవాడ బాలిక
- ఇండియా, ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

మధురవాడ: వయసు ఆరేళ్లు..ఒక్క నిమిషంలోనే 370 కంప్లీట్ ఫుల్ పంచ్ స్ట్రైక్స్ కొట్టి రికార్డులు కొల్లగొట్టిన కరాటే చిచ్చర పిడుగు. ఉండేది..పీఎం పాలెం. ఆ పంచ్‌ల చిన్నారి పేరు పితాని హనీష జైవర్ధిని. ప్రస్తుతం మిథిలాపురి వుడా కాలనీలో ఓ స్కూల్లో 1వ తరగతి చదువుతోంది. తండ్రి మోహన శ్రీనివాసరావు ప్రైవేటు గ్యాస్ ఏజెన్సీలో గ్యాస్ సిలిండర్స్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. తల్లి మీనాదేవి.. గృహిణి. కుమార్తె హనీషకు ఫైటింగ్ అంటే మక్కువ.. అది గమనించిన తండ్రి సమీపంలో ఉన్న డ్రాగన్ ఫిట్‌నెస్ సెంటర్‌లో కోచ్ పెదిరెడ్ల కనకరాజు వద్ద చేర్పించి కరాటేలో శిక్షణ ఇప్పించాడు. హనీష చురుగ్గా ఉండడంతో కనకరాజు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో..

కరాటేలో విశేషంగా రాణిస్తున్న హనీషను మాస్టర్ రాజు అన్ని విధాలుగా ప్రోత్సహించాడు. 6 ఏళ్ల 10 నెలల 11 రోజుల వయసులో 370 (నిమిషంలో) ఫుట్ కాంటాక్ట్ స్ట్రైక్స్ కొట్టి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించి పలువురి మన్ననలను పొందింది. గత ఏడాది ఏప్రిల్ 14న ఈ ఘనత సాధించింది.



ఇండియా, ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్లతో హనీష జైవర్ధిని

ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో..

హనీష ఇంకా ఏదో సాధించాలని తపన ఉన్న చిచ్చరపిడుగు..దీంతో 6 ఏళ్ల 10 నెలలు 11 రోజుల్లో వేర్వేరు బోర్డులు మీద చేతితో 370 కంప్లీట్ పంచ్ స్ట్రైక్స్ కొట్టి ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. దీనికి సంబంధించి ధ్రువపత్రం కూడా ఇటీవల అందుకుంది.



హనీష జైవర్ధినికి తర్ఫీదు ఇస్తున్న మాస్టర్ కనకారావు

చిన్నతనంలోనే రికార్డులు

హనీష అన్నింటా చురుగ్గా ఉంటుంది. చెప్పింది చెప్పినట్టు చేస్తుంది. చాలా తెలివైనది. అందుకే ఈ అరుదైన రికార్డు నెలకొల్పగలిగింది. గతంలో కూడా ఎవ్వరూ ఇలా చేసినట్టు ఆధారాలు లేవు. హనీషకు శిక్షణ ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది.

–పి. కనకారావు, చీఫ్ కోచ్, డ్రాగన్ ఫిట్‌నెస్ సెంటర్

ద్రోణంరాజు సేవలు అభినందనీయం

- విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి
- ద్రోణంరాజు సత్యనారాయణ బ్రాహ్మణ సామాజిక భవనం ప్రారంభం


సింహాచలం: బ్రాహ్మణుల అభ్యున్నతికి స్వర్గీయ ద్రోణంరాజు సత్యనారాయణ విశేషంగా కృషి చేశారని విశాఖ శ్రీశారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి అన్నారు. జీవీఎంసీ 97వవార్డు పరిధి సుజాతనగర్‌లో నిర్మించిన ద్రోణంరాజు సత్యనారాయణ బ్రాహ్మణ సామాజిక భవనాన్ని సోమవారం సాయంత్రం విశాఖ శ్రీశారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో బ్రాహ్మణులకు ఒక భవనం ఉండాలని అప్పట్లో ద్రోణంరాజు సత్యనారాయణ ఆశించారన్నారు. భవనం నిర్మాణానికి సుజాతనగర్‌లో ఆయన స్థలం కేటాయించారని చెప్పారు. ఆయన వంతు సహాయంగా శ్లాబ్ వరకు భవనాన్ని నిర్మాణం చేసినట్టు తెలిపారు. ద్రోణంరాజు మృతి తర్వాత భవనం పనులు నిలిచిపోయాయని.. ఇటీవల బ్రాహ్మణులంతా ఆ భవనం పూర్తి చేయాలని బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు తమ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. వెంటనే ఆ విషయాన్ని పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్, ద్రోణంరాజు శ్రీవాత్సవ, 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, బ్రాహ్మణ సంఘాల ప్రతినిధుల తీసుకెళ్లడం జరిగిందన్నారు. జీవీఎంసీ నిధులతో భవనాన్ని పూర్తి చేసుకుని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఇందుకు చొరవ చూపిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ను అభినందించారు. ఈ వారంలోనే భవనాన్ని ఎమ్మెల్యే అదీప్ రాజ్ బ్రాహ్మణులకు అందజేస్తారని తెలిపారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ బ్రాహ్మణ సంఘ భవనం నిర్మాణం పూర్తికావడం చాలా సంతోషంగా ఉందన్నారు. బ్రాహ్మణ సామాజిక వర్గానికి తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ద్రోణంరాజు శ్రీవాత్సవ, 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, 97వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్, గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం, పలు బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



భవనాన్ని ప్రారంభిస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి

గుండెపోటుతో ఏఎస్‌ఐ మృతి

అల్లిపురం: మార్నింగ్ వాక్‌కు వెళ్లిన మహారాణిపేట ఏఎస్‌ఐ బీవీ రమణ (2164) గుండె పోటుతో మృతి చెందాడు. మహారాణిపేటలో ఏఎస్‌ఐగా పనిచేస్తున్న బీవీ రమణ కలెక్టర్ ఆఫీస్ దరి కృష్ణానగర్‌లో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. సోమవారం ఉదయం మార్నింగ్ వాక్‌కు ఆర్కేబీచ్‌కు వెళ్లాడు. నడుస్తుండగా గుండె నొప్పి రావడంతో ఆస్పత్రికి తరలించారు. వైద్యులు స్టంట్ కూడా వేశారు. చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. రమణకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. పెద్ద అబ్బాయికి వివాహం కాగా, రెండో అబ్బాయికి వివాహం కావాల్సి ఉందని సిబ్బంది తెలిపారు. రమణ కుటుంబానికి మహారాణిపేట సీఐ రమణమూర్తితో పాటు ఎస్.ఐలు, తోటి సిబ్బంది సంతాపాన్ని తెలిపారు.



ఏఎస్‌ఐ బి.వి.రమణ (ఫైల్ ఫోటో)

మేయర్ బస్సులో..కమిషనర్ కాలినడకన

డాబాగార్డెన్స్: నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి సోమవారం క్యాంపు కార్యాలయం నుంచి నేరుగా ప్రజారవాణా ద్వారా జీవీఎంసీకి వచ్చారు. కమిషనర్ సాయికాంత్ వర్మ కూడా జీవీఎంసీ వాహనాలు పక్కన పెట్టి క్యాంపు కార్యాలయం నుంచి కాలినడకన జీవీఎంసీకి చేరుకున్నారు. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్ మాట్లాడుతూ కాలుష్య నియంత్రణకు నగర ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వారానికి ఒక్కరోజైనా ప్రజలంతా తమ సొంత వాహనాలు విడిచి ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకోవాలని కోరారు. జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు ప్రతి సోమవారం 'నో వెహికల్ జోన్' పాటిస్తున్నట్టు గుర్తు చేశారు. స్పందన పూర్తయిన తర్వాత బస్సులోనే మేయర్ క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. కమిషనర్ కూడా క్యాంపు కార్యాలయానికి నడుస్తూనే వెళ్లారు.



క్యాంపు కార్యాలయం నుంచి జీవీఎంసీకి బస్సులో వస్తున్న మేయర్



కాలినడకన క్యాంపు కార్యాలయం నుంచి జీవీఎంసీకి వస్తున్న కమిషనర్

లారీ ఢీకొని విద్యార్థిని దుర్మరణం

కూర్మన్నపాలెం: అనగంపూడి దరి శనివాడ ప్రధాన రహదారి సిగ్నల్ పాయింట్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫార్మాసిటీ ప్రాంతానికి చెందిన విద్యార్థిని మృతి చెందింది. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లేమర్తిలోని ఫార్మాసిటీ కాలనీకి చెందిన కొల్లిమల్ల పెదనరసింగరావు క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కూతురు జయసాహితి (15) పదో తరగతి చదువుతోంది. మల్కాపురం నుంచి ఫార్మాసిటీ వైపు తన తల్లి గోవిందమ్మతో కలిసి ద్విచక్రవాహనంపై వస్తుండగా అగనంపూడి దరి శనివాడ జంక్షన్ వద్ద వెనుక నుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో వెనుక కూర్చున్న సాహితి సంఘటనా స్థలంలోనే మృతి చెందింది. సమాచారం అందుకున్న దువ్వాడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సాహితి (ఫైల్)

మలేషియాకు చేరుకున్న ఇండియన్ నావల్ షిప్



మలేషియా తీరం వద్ద నావల్ షిప్

మల్కాపురం: పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన ఇండియన్ నావల్ షిప్ మలేషియాలో పోర్ట్ క్లాంగ్ తీరానికి సోమవారం చేరుకుంది. తూర్పు నావికాదళం విస్తరణలో భాగంగా భారత్, మలేషియా దేశాల మధ్య బలమైన స్నేహ బంధాలను పటిష్టం చేసే అంశాన్ని దృష్టిలో పెట్టుకుని ఇండియన్ నావిల్ షిప్ (యుద్ధ నౌక) మలేషియా నావల్ ప్రాంతానికి చేరింది. ఈ నెల 31వ తేదీ వరకు ఈ నౌక మలేషియా దేశతీరంలో విహరిస్తుంది. అక్కడ అధికారులతో ఇండియన్ నావల్ షిప్ అధికారులు ముచ్చటిస్తారు. ఇరు దేశాల స్నేహ బంధాన్ని పెంచుకునేం దుకు ఈ సమావేశం కీలకంగా మారనుంది.

ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

కంచరపాలెం: జిల్లాలోని వివిధ ప్రభుత్వ/ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశాలకు గాను వచ్చే నెల 6వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ అనంతరం విద్యార్థులు తమ దగ్గరలోని ప్రభుత్వ ఐటీఐలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. స్టీల్ ప్లాంట్ ఆర్ కార్డుకు సంబంధించిన అభ్యర్థులు ప్రత్యేక కేటగిరిలో దరఖాస్తు చేసుకుని తప్పనిసరిగా వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఇప్పటివరకు 900 దరఖాస్తులు అందగా 504 మంది వెరిఫికేషన్ చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశం

విశాఖ విద్య: బదిలీలు ప్రశాంత వాతావరణంలో ముగిసేలా తీసుకోవాల్సిన చర్యలపై ఉపాధ్యాయ సంఘాలతో సోమవారం ఇంచార్జి డీఈవో జి. లక్ష్మణరావు సమన్వయ సమావేశం నిర్వహించారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి గుర్తింపు ఉన్న ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు హాజరయ్యారు. ఆన్‌లైన్ విధానంలో బదిలీలు జరుగుతున్నందున, ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా ముందుకెళ్తున్నట్లు డీఈవో లక్ష్మణరావు అన్నారు. సంఘాల బాధ్యులు లేవనెత్తిన అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. అయితే సమావేశానికి కొన్ని సంఘాలు గైర్హాజరయ్యాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరించే సంఘాల నాయకులకు డీఈవో కార్యాలయ అధికారులు ప్రాధాన్యత ఇస్తుండటంపై అసంతృప్తితో ఉన్న కొంతమంది ఉపాధ్యాయులు, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమౌతున్నట్లు తెలుస్తోంది. డీఈవో చాంబర్, కార్యాలయంలోని కీలక సెక్షన్‌ల వద్ద గంటల తరబడి ఉంటూ ప్రలోభాలకు తెరలేపుతున్నారనే ప్రచారం ఉంది. బదిలీల సమయంలో ఇలాంటి వాటికి చెక్ పెట్టేలా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ దృష్టి సారించాలని పలువురు ఉపాధ్యాయులు కోరుతున్నారు.

నేటి నుంచి మూడో విడత చందనం అరగదీత

సింహాచలం: సింహగిరిపై మంగళవారం నుంచి మూడో విడత చందనం అరగదీత ప్రారంభంకానుంది. వచ్చే నెల 4న జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సమర్పించే మూడు మణుగుల పచ్చి చందనాన్ని(120 కిలోలు) సమకూర్చేందుకు అరగదీత కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి ఆలయ బేడా మండపంలో సిబ్బంది అరగదీతను చేపట్టనున్నారు. కాగా గడిచిన చందనోత్సవం రోజు, వైశాఖ పౌర్ణమి రోజు మూడేసి మణుగుల చొప్పున రెండు విడతల చందనం సమర్పణ పూర్తయింది.